క్లుప్తంగా

సురక్షిత ప్రయాణంతో అందరికీ మేలు



ఆత్మకూర్: వాహనదారులు సురక్షిత ప్రయాణం చేయడం వల్ల ప్రయాణికుల కుటుంబాలకు మేలు జరుగుతుందని ఆత్మకూర్ సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్ అన్నారు. ఆదివారం ఆత్మకూర్‌లోని కొత్తకోట జంక్షన్ వద్ద రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా వాహనదారులకు అవగాహన కల్పించి హెల్మెట్లు ధరించిన వారికి గులాబీ పువ్వులు అందించి అభినందించారు. మద్యం సేవించి వాహనం నడపరాదని, హెల్మెంట్ తప్పనిసరిగా ధరించాలని, సీటు బెల్టు పెట్టుకోవాలని, అతివేగం ప్రమాదకరమని, ధృవపత్రాలు వెంట బెట్టుకోవాలని సూచించారు.

చెట్లు ఎండిపోతున్నా పట్టించుకోరా?

వనపర్తి టౌన్: రాష్ట్ర ఐటీ శాఖ మాజీ మంత్రి కేటీఆర్ వనపర్తికి వచ్చిన సందర్భంలో హడావిడిగా డివైడర్ల మధ్యలో చెట్లను ఏర్పాటు చేశారని, నేడు అవి ఎండిపోతున్నా పట్టించుకోరా అని తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు ఎంఏ ఖాదర్ పాషా ఆవేదన వ్యక్తం చేశారు. పచ్చదనం కోసం రూ.2.30 కోట్ల టెండర్‌తో ఏర్పాటు చేసిన చెట్లకు నీళ్లు పోసే దిక్కులేక ఎండిపోతున్నాయని, వెంటనే వాటిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఆదివారం విన్నవించారు. మున్సిపల్ అధికారులను సంప్రదించిన స్పందించడం లేదని వాపోయారు.

ముళ్ల పొదలను తొలగించండి



వీపనగండ్ల: మండల కేంద్రానికి సమీపంలో ఉన్న పల్లె చెరువు కట్టపై ప్రమాదకరంగా పెరిగిన కంపతార చెట్లను తొలగించాలని ఆయకట్టు రైతులు చెన్నయ్య, కుర్మయ్య, బాలయ్య, బిచ్చన్న, భాస్కర్ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. అన్ని వేళల్లో చెరువులో నీరు పుష్కలంగా ఉండడం చెరువులో ఎన్నో రోజులుగా మొసళ్లు సంచరిస్తున్నాయన్నారు. ఏపుగా పెరిగిన కంపతార చెట్ల మధ్యలో అవి ఉండి మనుషులు, పశువులపై దాడి చేసే ప్రమాదం ఉందని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దాదాపు 500 మీటర్ల పొడవున కట్టపై ఉన్న కంపతార చెట్లను తొలగించాలని కోరుతున్నారు.

సీఐ శివకుమార్‌కు సన్మానం



ఆత్మకూర్: ఆత్మకూర్ సీఐగా బాధ్యతలు చేపట్టిన శివకుమార్‌ను ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఆత్మకూర్, అమరచింత, మదనపూర్ మండలాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, ప్రజలు సహకరించాలని సీఐ శివకుమార్ కోరారు. కార్యక్రమంలో నాయకులు రహ్మతుల్లా, తులసీరాజ్, కుర్ని రవికాంత్, గడ్డం శ్రీనివాస్, వెంకటేష్, గంగ, అజ్మతుల్లా, సాయిరాఘవ, చాంద్‌పాష, అబ్దుల్లా తదితరులు ఉన్నారు.

మాజీ సర్పంచ్‌కు..

పెబ్బేరు రూరల్: జై భీమ్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని కొత్త సూగూరులో మాజీ సర్పంచ్ జూడం వెంకటేష్‌ను సన్మానించారు.

పరామర్శ



పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణంలోని మర్రికుంటకు చెందిన ఆర్ఎంపీ హరికృష్ణ వారం క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటయ్య యాదవ్ స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి బాధితుడిని పరామర్శించారు. మెరుగైన చికిత్స కోసం నిమ్స్ ఆస్పత్రిలో చేరాలని, అందుకు సంబంధించిన ఏర్పాట్లను తాను చూసుకుంటానని ఎమ్మెల్యే బాధితుడికి భరోసా కల్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్, కౌన్సిలర్లు విభూది నారాయణ, చీర్ల సత్యంసాగర్, నాయకులు చీర్ల జనార్దన్, శివకుమార్, రాములు, అంజి, సత్యం, వాల్యానాయక్ పాల్గొన్నారు.

కలశాలు అందజేత

పెద్దకొత్తపల్లి: మహాసముద్రం గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ సుగుణమ్మ కుమారుడు వెంకటేష్‌గౌడ్ నాయినోనిపల్లి మైసమ్మ ఆలయానికి మూడు కలశాలు అందజేశారు. ముందుగా తన భార్య పద్మతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రోడ్ల మరమ్మతుకు మోక్షమెప్పుడో!

- గుంతల మయంగా గ్రామీణ రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



ఖిల్లాఘనపురం నుంచి పర్వతాపురం వెళ్లే రోడ్డుపై గుంతలు

ఖిల్లాఘనపురం: మండలంలోని గ్రామాలకు వెళ్లే రోడ్లు పూర్తిగా గుంతలమయం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఖిల్లాఘనపురం మండల కేంద్రం నుంచి పర్వతాపురం, గట్టుకాడిపల్లి, ఆగారం, మల్కిమియాన్‌పల్లి, మహ్మదుస్సేన్‌పల్లి తదితర గ్రామాలకు వెళ్లే రోడ్లపై తారు లేచి గుంతలుగా మారాయి. ఆయా గ్రామాల ప్రజలు అవసరాల కోసం ఏ పట్టణానికి వెళ్లాలన్నా మండల కేంద్రానికి రావాల్సిందే. ఆటోలు తదితర ప్రైవేటు వాహనాల్లో ప్రతి నిత్యం ప్రజలు అవసరాల నిమిత్తం ఖిల్లాఘనపురం వస్తుంటారు. దీంతో పలుమార్లు ద్విచక్ర వాహనాలు, ఆటోలు అదుపు తప్పి పలువురు ప్రమాదాల బారిన ఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బీటీ రోడ్లకు మరమ్మతు చేయించి రినివల్ వేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



గట్టుకాడిపల్లికి వెళ్లే రోడ్డు..



ఆగారం వెళ్లే రోడ్డు..



మల్కిమియాన్‌పల్లి నుంచి అప్పారెడ్డిపల్లికి వెళ్లే రోడ్డు

వ్యవసాయాన్ని నీరు గార్చేందుకు కుట్ర



నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐకేఎస్ నాయకులు

అమరచింత: కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేయడానికి కుట్రలు పన్నుతుందని, బడ్జెట్ కేటాయింపులో సైతం వ్యవసాయ రంగాన్ని విస్మరించిందని ఏఐకేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్ అన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఆదివారం ఏఐకేఎస్ ఆధ్వర్యంలో పాంరెడ్డిపల్లిలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో వ్యవసాయ రంగాన్ని మేలు చేకూర్చే విధంగా రూపొందించామని ఆర్థిక మంత్రి చెప్పుకోవడం వింతగా ఉందన్నారు. వ్యవసాయానికి రూ.2,22,251 కోట్ల బడ్జెట్ కేటాయించినట్లు చెప్తున్నా.. వాస్తవంగా రూ.1,17,528 కోట్లు మాత్రమే ఇచ్చారన్నారు. దేశంలో 14.75 కోట్ల మంది రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని వెల్లడించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వకుండా ప్రతి ఏటా రూ.4 లక్షల కోట్లు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాజు, మోహన్, శంకర్, మాసన్న, శివకుమార్, అశోక్, రాకేష్ పాల్గొన్నారు.

నేడు లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

ఆత్మకూర్: మండలంలోని కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చేతుల మీదుగా చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు రహ్మతుల్లా, తులసీరాజ్, పరమేష్, నల్గొండ శ్రీను తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిర్వహించే కార్యక్రమంలో మండలంలోని లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు హాజరుకావాలని కోరారు.

డప్పు కళాకారుల అభ్యున్నతికి కృషి

గోపాల్‌పేట: మండలంలోని పొలికెపాడులో ఆదివారం డప్పు కళాకారుల వనపర్తి జిల్లా ఇన్‌చార్జి రాజు, ఖిల్లాఘనపురం అధ్యక్షుడు మల్ల అశోక్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర డప్పు కళాకారుల గ్రామ సంఘాన్ని ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా వడ్డెమాన్ నాగన్న, ఉపాధ్యక్షుడిగా ఎర్రన్న, ప్రధానకార్యదర్శి రాజు, సహాయ కార్యదర్శి రాములు, కోశాధికారి రామును నియమించారు. ఈ సంఘం తెలంగాణ రాష్ట్ర డప్పు కళాకారుల అభ్యున్నతికి పనిచేస్తుందని వారు తెలిపారు. అశోక్, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం నాయకులు

పాన్‌గల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఆ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు శ్యామలయ్య, బీరయ్య మాట్లాడారు. 19 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న తమకు ఉద్యోగ భద్రత లేక అభద్రతా భావంతో ఉన్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపర్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ భద్రత, పేస్కెల్ వర్తింపచేయాలని కోరారు. ఈ విషయంపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటేశ్వర్‌రావు, జన్మనాయుడు పాల్గొన్నారు.

ఎల్‌కే అద్వాణీకి పాలాభిషేకం



ఎల్‌కే అద్వాణీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని రాజీవ్‌చౌక్‌లో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము ఆధ్వర్యంలో ఆదివారం ఎల్‌కే అద్వాణీ చిత్రపటానికి జిల్లా అధ్యక్షుడు నారాయణ పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్‌కే అద్వాణీకి భారతరత్న అవార్డు ప్రకటించడం ఎంతో గౌరవ కారణమని, నాడు పార్లమెంట్‌లో ఇద్దరు సభ్యులు ఉన్నప్పటి నుంచి నేడు 400 పైచిలుకు సీట్లను సాధించేలా బీజేపీని పటిష్టంగా చేసిన ఘనత ఎల్‌కే అద్వాణీకే దక్కుతుందన్నారు. ఎల్‌కే అద్వాణీ దేశంలోనే గొప్ప నాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చిత్తారి ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షులు రామన్న వెంకటేశ్వర్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, సుమిత్రమ్మ, పార్లమెంట్ కోకన్వీనర్ ప్రవీణ్, జిల్లా అధికార ప్రతినిధి బాబురావు, పెద్దిరాజు, సామేల్, నాయకులు రాజశేఖర్‌గౌడ్, రాయన్న సాగర్, విక్రమ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

మోహియుద్దీన్‌కు నివాళి



వనపర్తి టౌన్: స్వాతంత్ర్య పోరాటంలో తన కలం, గళంతో పోరాడిన యోధుడు మోహియుద్దీన్ సేవలు మరువలేనివని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. మగ్దూం మోహియుద్దీన్ 116 జయంతిని పురస్కరించుకొని టీజేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గిరిరాజాచారి, దేవన్న నాయుడు, బాలేమియా, కృష్ణయ్య, పరమేశ్వర చారి పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం



గోపాల్‌పేట: మండల కేంద్రంలో ఓ గడ్డివాము దగ్ధమైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ముందు సత్యనారాయణ అనే రైతు వారి పొలంలో సుమారు 600 కట్టల గడ్డిని వాముగా పెట్టుకున్నాడు. ఆదివారం మధ్యాహ్నం సమయంలో గుర్తుతెలియని పిల్లలు గడ్డివాముకు నిప్పు పెట్టడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే స్థానికులు ఫైర్ ఇంజిన్‌కు ఫోన్ చేయగా కొద్ది సేపటికి చేరుకున్న ఫైర్ ఇంజన్ దాదాపు మూడు గంటల పాటు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా వీలు కాలేదు. సాయంత్రం మంటలు అదుపులోకి వచ్చాయి. కానీ అప్పటికే గడ్డివాము మొత్తం దగ్ధమైపోయింది. దీని విలువ రూ.75వేలు ఉంటుందని రైతు వాపోయాడు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం



ఆత్మకూర్: మక్తల్ నియోజకవర్గంలోని ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి పరంగా ముందుండాలని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే కుటుంబసభ్యులతో కలిసి తిరుమల తిరుపతి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని మొక్కులు తీర్చుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తల్లి రాములమ్మ, సతీమణి లలిత, కుమారులు అచ్యుత్‌రాంరాజ్, అమిత్‌రాజ్, కుటుంబసభ్యులు రాజేశ్వరి, వెంకటనారాయణ, రమాదేవి, కృష్ణమూర్తి, ఉమామహేశ్వరి, నారాయణ, వరలక్ష్మి, ఆనంద్ తదితరులు ఉన్నారు.

అపూర్వ ఆత్మీయ సమ్మేళనం



వనపర్తిలో గురువులతో పూర్వ విద్యార్థులు



ఆత్మకూర్‌లో..

వనపర్తి టౌన్: 20 ఏళ్ల కిత్రం పాఠశాలలో చదువుకున్న మిత్రులు అందరూ ఒక చోట కలుసుకొని ఆనందోత్సవాలతో గడిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని దళితవాడ పాఠశాలకు చెందిన 2002–03 విద్యా సంవత్సరంలో 10వ తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం పేరుతో గురుపూజోత్సవం నిర్వహించారు. అప్పట్లో విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు నారాయణరెడ్డి, బలరాంమూర్తి, జగదీశ్వర్‌రెడ్డి, మధుర, వరలక్ష్మి, లలితమ్మ, సుమిత్రమ్మ, ప్రకాశ్ లకు విద్యార్థులు పాదపూజ చేసి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి చిన్నారెడ్డి హాజరై దళితవాడ పాఠశాల పునర్నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయనను విద్యార్థులు, ఉపాధ్యాయులు శాలువా, మెమోంట్‌తో సత్కరించారు. కార్యక్రమంలో సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్, రాజారామ్‌ప్రకాశ్, రిటైర్డ్ ఎంఈఓ రాఘవరెడ్డి, జీహెచ్ఎం చంద్రశేఖర్, నాగరాజు, భైరోజు చంద్రశేఖర్, జిలానీ, నవీన్‌కుమార్, మల్లికార్జున్, గంధం రవి కుమార్, శ్రీనివాసులు, శ్రీనివాస్‌గౌడ్, ఖదీర్, యూసుఫ్, గిరి, లక్ష్మి, కరుణ, శాంతమ్మ, చంద్రకళ, ఆశమ్మ, యశోద, రాజేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

32 ఏళ్ల తర్వాత

ఆత్మకూర్: 32 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాలలోని తరగతి గదులన్నీ కలియతిరిగారు. అధ్యాపకుల మందలింపులు, బెత్తం దెబ్బలు గుర్తుకు తెచ్చుకొని తెగ ఆనందపడ్డారు. ఆదవారం ఆత్మకూర్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో 1992–93 పదో తరగతి బాలికల బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సమావేశమయ్యారు. ఈసందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులకు పదాభివందనం చేసి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి ఆశీర్వచనాలు అందుకున్నారు. తమ స్నేహితుల్లో ఉన్న పేద విద్యార్థుల ఉన్నత చదువులకు సహకరించాలని, చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు నివ్వాలని అధ్యాపకులు ఈశ్వరయ్య, బీచుపల్లయ్య, పద్మమ్మ, బాలరాజు, దశరథ్ అన్నారు. కార్యక్రమంలో అటెండర్ చంద్రమ్మ, పూర్వ విద్యార్థులు అనిత, సునీత, సుచరిత, గీత, భార్గవి, లలిత, రాధిక తదితరులు ఉన్నారు.

ప్రధాన రహదారిపైనే చెత్త



అమరచింత: డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్న చెత్త ఏకంగా ప్రధాన రహదారిపై పారవేస్తుండటంతో రహదారి అంతా చెత్తతో నిండిపోయింది. మరికల్–ఆత్మకూర్ ప్రధాన రహదారిపై నిత్యం చెత్తను పారవేస్తుండటంతో పరిసరాలు దుర్గంధంగా తయారయ్యాయి. అమరచింత మున్సిపల్ సిబ్బంది సేకరించిన చెత్తను విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. కానీ కొన్నేళ్లుగా తడి, పొడి చెత్తను వేరు చేయకుండా నిత్యం తగులబెడుతున్నా చెత్త మాత్రం రహదారిపైకి వస్తోంది. డంపింగ్ యార్డును మార్చుతున్నాం అని చెప్పుకొస్తున్న మున్సిపల్ కమిషనర్ వీటిపై దృష్టి సారించలేక పోతున్నారని పట్టణ ప్రజలు, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

మరమ్మతుకు నోచుకోని ఫాగింగ్ యంత్రం

అమరచింత: పట్టణంలో దోమల బెడదను నివారించడానికి కొనుగోలు చేసిన ఫాగింగ్ యంత్రం మరుగున పడింది. చిన్నపాటి మరమ్మతు సైతం చేపట్టకపోవడంతో ఫాగింగ్ యంత్రాన్ని మున్సిపల్ కార్యాలయంలోని మూలన పడేశారు. పది వార్డుల్లో మురుగు కాల్వలు శుభ్రం చేయని కారణంగా దోమల సంఖ్య విపరీతంగా పెరిగిపోతున్నా పట్టించుకునే వారే కరువయ్యారని ఆయా వార్డుల ప్రజలు ఆరోపిస్తున్నారు. రూ.రెండు లక్షలతో కొనుగోలు చేసిన ఫాగింగ్ యంత్రానికి మరమ్మతు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



సత్తాచాటిన కస్తూర్బా పాఠశాల విద్యార్థులతో సీనియర్ కరాటే మాస్టర్లు

కొత్తకోట రూరల్: జడ్చర్ల పట్టణంలోని జీనత్ పంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన 5వ రాష్ట్రస్థాయి సేవాలాల్ కరాటే చాంపియన్‌షిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో కొత్తకోట పట్టణ కేంద్రానికి చెందిన షోటోఖాన్ కరాటే అకాడమీకి చెందిన 17మంది విద్యార్థులు ప్రతిభ చాటారు. కటాస్, కుమ్మితే విభాగాల్లో పాల్గొన్న విదార్థులు బంగారు, వెండి పథకాలు సాధించినట్లు క్లబ్ ఫౌండర్ అబ్దుల్ నబీ తెలిపారు. వీరిలో అమడబాకుల కస్తూర్బాగాంధీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన 10మంది విద్యార్థినులు ఉన్నట్లు మాస్టర్ నబీ తెలిపారు.

వనపర్తిలో..

జిల్లా కేంద్రంలోని బాలకిష్టయ్య మైదానంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీలను చంద్రశేఖర్ మెమోరియల్ చాంపియన్‌షిప్ వారి ఆధ్వర్యంలో నిర్వహించగా.. షోటోఖాన్ కరాటే అకాడమీకి చెందిన 13మంది విదార్థులు కటాస్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి బంగారు, వెండి పథకాలు సాధించినట్లు క్లబ్ ఫౌండర్ అబ్దుల్ నబీ తెలిపారు. ఈ పోటీల్లో మండలంలోని కనిమెట్టకు చెందిన 13మంది విద్యార్థులు ఉన్నారు.

16న కార్మిక ప్రదర్శన గ్రామీణబంద్



మాట్లాడుతున్న నాయకులు

అమరచింత: దేశ వ్యాప్తంగా ఈనెల 16న కార్మిక ప్రదర్శన గ్రామీణ బందు కార్యక్రమం నిర్వహిస్తున్నామని కార్మిక, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు వెల్లడించారు. పట్టణంలోని జీఎస్ భవన్‌లో ఆదివారం కార్మిక, వ్యవసాయ, రైతు సంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఉద్యోగ, కార్మిక, రైతు ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని మండిపడ్డారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానం రద్దు చేసి కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదాల్లో మరణించిన కార్మికులకు రూ.25 లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టాలన్నారు. దహన సంస్కారాలకు రూ.30వేల ఇవ్వాలని, రాష్ట్రంలో రూ.21 వేల వేతనం అమలుచేయాలని కోరారు. ఫిబ్రవరి 10న అమరచింత మండల కేంద్రంలో వాహన ర్యాలీ నిర్వహించాలని, ఇందుకు కార్మిక, కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఎన్ రమేష్, బుచ్చన్న, ప్రసాద్, భాస్కర్, జీఎస్ గోపి, రాజన్న, అజయ్, వెంకటేష్, కుర్మన్న తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పాన్‌గల్ ఈదమ్మ జాతర



అమ్మవారి గుడిలో కొలువుదీరిన ఈదమ్మ



షిడె కోసం అలంకరించిన రథం

పాన్‌గల్: మండల కేంద్రంలోని ఈదమ్మ దేవత జాతర మంగళవారం నుంచి నిర్వహిస్తున్నట్లు పూజరి నాగన్న తెలిపారు. అమ్మవారి జాతర రెండు రోజుల పాటు జరుగుతుందని, మొదటి రోజు షిడె, రెండో రోజు పోలారం బండ్లు, బోనాలు కార్యక్రమాలు ఉంటాయన్నారు. జాతర వేడుకలకు మండలంలోని భక్తులతో పాటు పాలమూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు. జాతర సందర్భంగా అమ్మవారి గుడి పరిసరాల్లో మిఠాయిలు, బొమ్మల దుకాణాలు వెలిశాయి. అమ్మవారిని దర్శించుకుంటే అంతా మంచి జరుగుతుందని, పంటలు, పాడి సంవృద్ధి వస్తుందని నమ్మకం. ఈదమ్మ ఉత్సవాల కోసం గుడిని ముస్తాబు చేశారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పంచాయతీ, గుడి కమిటీ సభ్యుల సమన్వయంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఆదర్శ ప్రెస్‌క్లబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి



కమిటీ సభ్యులను సన్మానిస్తున్న ఐజేయూ నాయకులు

పెబ్బేరు రూరల్: స్థానిక ప్రెస్‌క్లబ్‌ను ఆదర్శంగా తీర్చిదిదేందుకు ప్రతి ఒక్క జర్నలిస్టు కృషి చేయాలని టీయుడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు గుండ్రాతి మధుగౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మొదటి కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన టీయుడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా కమిటీ సభ్యులతో కలిసి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు బాలవర్ధన్, ప్రధాన కార్యదర్శి పరశురామ్, కోశాధికారి రమేష్, ఉపాధ్యక్షులు గోపాలకృష్ణ, కిరణ్ కుమార్‌గౌడ్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు మాధవరావు, పార్థారెడ్డి, అరుణ్, సలీం, రవీందర్‌గౌడ్, చిరంజీవి, విజయ్‌కుమార్, బాలరాజు, రాజేంద్రప్రసాద్, స్వామి, అతీక్, రాజేష్ జ్యోతిష్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి పునాది



మహిళలతో మాట్లాడుతున్న చిన్నారెడ్డి

వనపర్తి టౌన్: 10ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో విద్యావ్యవస్థ చిన్నాభిన్నం అయ్యిందని మాజీ మంత్రి, ఏఐసీసీ కార్యదర్శి చిన్నారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. బలమైన విద్యాభివృద్ధికి పునాది వేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కంకణబద్ధుడై ఉన్నారని చెప్పారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని హరిజనవాడ ఉన్నత పాఠశాలలో పూర్వపు భవనం పెచ్చులు ఊడటాన్ని చిన్నారెడ్డి పరిశీలించారు. అంతేకాకుండా ఆయా కాలనీవాసులతో ప్రభుత్వ పనితీరు గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడిలేని ఊరు ఉండకూడదని, అక్షర జ్ఞానం అందరి దరికి చేరాలని సీఎం రేవంత్‌రెడ్డి ధృడసంకల్పంతో ఉన్నారని పేర్కొన్నారు. విద్యా రంగంలో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకుండా ఉన్న బడులను మూసివేసే విధంగా, ఉపాధ్యాయ హక్కులను కాలరాసేలా గత ప్రభుత్వం వ్యవహరించిందని మండిపడ్డారు. హరిజనవాడ పాఠశాలను అధునాతనంగా నిర్మించేందుకు తన వంతుగా కృషి చేయనున్నట్లు వెల్లడించారు.

24 గంటల్లోనే..

ప్రభుత్వం ఏర్పడిన 24 గంటల్లోనే 2 గ్యారెంటీలను అమలు చేశామని, మరో రెండు గ్యారెంటీలు అయిన మహిళలకు వంటింటి గ్యాస్ సిలిండర్‌ను రూ. 500కే ఇచ్చే పథకాన్ని, 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగానికి బిల్లులేని పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, మరో రెండు గ్యారెంటీలను లోక్‌సభ ఎన్నిల తర్వాత అమల్లోకి తీసుకొచ్చేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వనపర్తిలో ఇండస్ట్రీయల్ కారిడార్ ఏర్పాటుకు వేల ఎకరాల స్థలం అవసరం పడుతుందని, ఆ దిశగా స్థల సేకరణకు ప్రయత్నాలు చేపట్టామని వెల్లడించారు. వనపర్తికి అవసరమైన వెటర్నరీ, ఇంకా మిగిలిపోయిన అత్యున్నత విద్యా సంస్థలను తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో ఖమ్మర్ మియా, నిరంజన్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.